టీజీఈజేఏసీ సదస్సును విజయవంతం చేయాలి

నాంపల్లి: పెండింగ్‌లో ఉన్న అన్ని డిమాండ్లను పరిష్కరించాలంటూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 4న మధ్యాహ్నం 2 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఉద్యోగ సదస్సుకు సంఘీభావాన్ని ప్రకటించినట్లు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు సంయుక్త నిర్వహణలో ఉద్యోగ జేఏసీ సదస్సు జరుగుతుందని వివరించారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులందరూ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను, బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్‌కార్డులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే సమావేశాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

సెల్ టవర్ తొలగించాలని సీఎంకు వినతి

చార్మినార్: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని చార్మినార్ పంజేషాలోని ఇరానీగల్లీ బస్తీ ప్రజలు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎం వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఈ సెల్ టవర్ విషయాన్ని జీహెచ్ఎంసీ చార్మినార్ డిప్యూటీ కమిషనర్ సరితకు వివరించామని స్థానికులు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సలాం బిన్ అమేర్ షాహిబీ, సయ్యద్ రెహ్మత్, అబ్దుల్ రెహ్మాన్ బిన్ అలీ, సాజిద్, సయ్యద్ నహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. నిరుద్యోగులు, మహిళలు, చదువుకున్న నిరుద్యోగ యువత, దళిత యువకుల కోసం ఎన్నో పథకాలు అమలులో ఉన్నాయన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

జన్మదిన వేడుకలు



చార్మినార్: టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాతబస్తీ నుంచి తరలివెళ్లిన తాము కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్సార్ సీపీ గ్రేటర్ మాజీ ప్రధాన కార్యదర్శి తిరుపతి శ్రీనివాస్‌రావు తెలిపారు.

సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్‌గా నరసింహ



సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.నరసింహ నియమితులయ్యారు. కమిషనరేట్ పరిధిలోని భారీగా జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసాచారి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అబిడ్స్ పోలీస్‌స్టేషన్ డీఐగా ఉన్న నరసింహను నియమించడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

బస్తీల్లో ఫాగింగ్ నిర్వహించండి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది బస్తీల్లోని చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో దోమల బెడద అధికం కావడంతో స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల బెడదతో ప్రజలు డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో వారానికి రెండుసార్లు అయినా ఫాగింగ్ నిర్వహించాలని బస్తీల ప్రజలు కోరుతున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ బస్తీల్లో ఫాగింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టోలిచౌకీలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై హర్షం

- త్వరలోనే ప్రారంభం
- తమ డిమాండ్ నెరవేరింది

అంటున్న పరిసర ప్రాంతాల వాసులు



అజీజ్‌బాగ్‌లో ఏర్పాటు కానున్న టోలిచౌకీ పోలీస్‌స్టేషన్

గోల్కొండ: ఎట్టకేలకు టోలిచౌకీలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కావడంపై టోలిచౌకీ పరిసర ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై నగర పోలీస్ కొత్వాల్ ఆదేశాలు జారీ చేయడమే కాక దానికి ఎస్‌హెచ్‌ఓను కూడా నియమించారు. త్వరలోనే ఇది ప్రారంభం కానుందని తెలిసింది. రెండేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ల పరిధుల పునర్విభజనలో భాగంగా టోలిచౌకీ కొన్ని ప్రాంతాలను కొత్తగా ఏర్పాటు చేసిన ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కలిపారు. కాగా టోలిచౌకీ చౌరస్తా సరిగ్గా ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందో ఇప్పటికీ అయోమయంలో ఉన్నారు. చౌరస్తాకు ఎగువన ఉన్న హకీంపేట్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్, నిజాం కాలనీ, తదితర ప్రాంతాలు హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి. మరో వైపు చౌరస్తాను ఆనుకొని ఉన్న ఒవైసీ కాలనీ, సాలర్‌జంగ్ కాలనీలు లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయి. టోలిచౌకీ చౌరస్తా నుంచి టూంబ్స్ చౌరస్తా వెళ్లే రోడ్డుకు ఎడమవైపు భాగం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు వస్తుంది. ఇలా మొత్తం నాలుగు పోలీస్‌స్టేషన్ల నెంబర్లు తమ వద్ద ఉంచుకోవాల్సి వస్తుందని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు అంటున్నారు.

అందరికీ అందుబాటులో...

టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ టోలిచౌకీ పరిసర వాసులందరికీ అందుబాటులో ఉంటుంది. టోలిచౌకీ పరిసరాల్లోని కాలనీలు, ప్రాంతాలను టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి కలిపారు. ఇప్పటి వరకు లంగర్‌హౌస్, హుమాయూన్‌నగర్, ఫిల్మ్‌నగర్, గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బస్తీలు, కాలనీలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తెచ్చారు. రెండేళ్లల్లో కాలనీల సంఖ్య పెరగడంతో పాటు జనాభా కూడా విపరీతంగా ఈ ప్రాంతంలో పెరిగింది. బహుళ అంతస్తుల ప్లాట్లు నిర్మితం అవ్వడం వల్ల వాహనాల సంఖ్య కూడా పెరిగింది. వీటన్నిటి దృష్టిలో పెట్టుకొని టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు సముచిత నిర్ణయం. టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో తమ సమస్యలన్నీ తీరుతాయని స్థానికులు ఆశిస్తున్నారు.

టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు మంచి నిర్ణయం..



టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు మంచి నిర్ణయం. టోలిచౌకీ పరిసర ప్రాంతాల వారికి పోలీస్‌స్టేషన్ పరిమితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతోంది. ప్రమాదం గానీ, దొంగతనం గానీ జరిగిన వెంటనే పోలీసులు సకాలంలో చేరుకునే అవకాశం ఉంటుంది. మరో వైపు స్థానికంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆటలకు కూడా చెక్ పెట్టే అవకాశం ఉంటుంది. పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన నగర కొత్వాల్‌కు అభినందనలు.

–మహ్మద్ ముస్తఫా, సమత కాలనీ

టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు మా చిరకాల అభిమతం..



పోలీస్‌స్టేషన్ల దూరం ఉండడం వల్ల చిల్లర దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ల పరిధులు తెలియక చాలా మంది చిన్నచిన్న దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. మా కాలనీ సమీపంలోనే పోలీస్‌స్టేషన్ ఏర్పడడంతో స్థానికులకు ధైర్యం వస్తుంది. ఏమి జరిగినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే అవకాశం కలిగింది. టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు మా చిరకాల అభిమతం.

–నర్సింహ్మా, అక్బర్‌పురా టోలిచౌకీ

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



రామకృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనీ

అబిడ్స్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయనకు వారు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మారం జగదీశ్వర్, ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ..ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై రామకృష్ణరావుకు ఎంతో అవగాహన ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి, క్యాబినేట్ మంత్రుల దృష్టికి ఉద్యోగుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ నగర జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు వెంటనే పూర్తిచేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు జరిగాయన్నారు. ఆ ప్రాంతాల్లో ఇంతవరకు మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు



డాక్టర్ రజనీ రెడ్డికి మెమొంటో అందజేస్తున్న సిబ్బంది

చార్మినార్: పేట్ల బురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఫోర్త్ క్లాస్ ఉద్యోగులతో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరి సహకారంతో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రజనీ రెడ్డి అన్నారు. మే డే ఉత్సవాల్లో భాగంగా ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. అనంతరం ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ మధులత, ఆసుపత్రి ఓ ఎస్ జయప్రకాష్‌ను కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కార్మికులు లేనిదే ఏ రంగాలు ఏ సంస్థలు అభివృద్ధి సాధించలేవన్నారు. ఆసుపత్రి ఉద్యోగులు వినోదా భాయ్, మాణిక్‌రావు, ఉమామహేశ్వర్, వేణుగోపాల్, శ్రీనివాస్, శివ కిరణ్, భాగ్యవతి, ఇంద్రరాణి, సాయికిరణ్, స్వరూప రాణి పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి



గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న రెజ్లింగ్ క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: రెజ్లింగ్ క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఫతే మైదాన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయనన నూతన అధ్యక్షుడిగా ఎన్నుకొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగాల్లో రెజ్లింగ్ క్రీడాకారుల కోటాను నిషేధించారని, దానిని పునరుద్ధరించాలని కోరారు. యువ రెజ్లింగ్ క్రీడాకారులు ఉన్నత చదువులు చదవడానికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

పాలాభిషేకం

చాంద్రాయణగుట్ట: సీఎం రేవంత్ రెడ్డి పర్యవేక్షణలో బీసీ కుల గణన చేపట్టిన అనంతరం కేంద్ర ప్రభుత్వం కూడా చేపట్టేందుకు ముందుకురావడం హర్షణీయమని చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేష్ అన్నారు. ఇందులో భాగంగానే చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్ వద్ద రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి వెంకటేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు మహేష్ గౌడ్, కాశమోని శ్యారావ్ ముదిరాజ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీల్లో ఎమ్మెల్యే పర్యటన



యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. యాకుత్‌పురా, బహ్మన్‌వాడి, నాగాబౌలి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల ప్రజలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. డ్రైనేజీ, తాగునీటి, రోడ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేటర్ అలందర్ వాలాజాహి, మజ్లిస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టించే వారిపై చర్యలు



సురేందర్

యాకుత్‌పురా: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పట్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ సర్కిల్–02 యాకుత్‌పురా ఏసీఎస్ఓ మోశా సురేందర్ అన్నారు. పురానిహవేలీలోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ..తమ సర్కిల్ పరిధిలో మొత్తం 90,828 రేషన్ కార్డులుండగా ఇందులో 3,45,783 మంది పేర్లు నమోదయ్యాయన్నారు. అదే విధంగా నూతన రేషన్ కార్డులకు 37,086 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 871 దరఖాస్తుల పరిశీలించామన్నారు. 81 రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కొనసాగుతుందన్నారు.

6 నుంచి బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



జియాగూడ: లక్ష్మీనర్సింహనగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు 25వ వార్షికోత్సవం, శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు ఎం.శ్రీకాంత్, జి.మదన్ మోహన్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ నవగ్రహ చండీహోమాలు, రుద్ర హోమాలు 8న శివలింగ ప్రతిష్ఠ కార్యక్రమం ముఖ్య అతిథులకు స్వాగతం, సన్మానం ఉంటుందన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



దూద్ బౌలి: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్‌కు చెందిన బ్లూ కోర్ట్ కానిస్టేబుల్ పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తుండగా ఆసుపత్రి ఆవరణలో జన జీవన జ్యోతి మెడికల్ షాపు ఎదురుగా ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండడం గమనించి వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురికి జైలు

గౌలిపురా: అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురికి జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టాకు చెందిన డ్రైవర్ మహ్మద్ వాజిద్ ఆలియాజ్ షా (30), మహ్మద్ రిజ్వాన్ (28), మహ్మద్ అహ్మద్ (26), మహ్మద్ అక్బర్ (37) స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరిచారు. 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ కేసు పూర్వాపరాలను పరిశీలించి మహ్మద్ వాజిద్‌కు 15 రోజులు జైలు శిక్ష, రిజ్వాన్, అహ్మద్, అక్బర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన షేక్‌పేట్‌లోని జలమండలి డీజీఎం కార్యాలయం వద్ద అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నీటి సరఫరా విషయంలో ప్రతినిత్యం తనకు వచ్చే ఫిర్యాదుల సంఖ్య పెరుగుతుందన్నారు. పలుచోట్ల లో ప్రెషర్‌తో నీరు వస్తుందని చిన్న కుటుంబానికి సైతం లో ప్రెజర్‌తో వచ్చే నీరు తాగడానికి సైతం సరిపోవడంలేదన్నారు. తాను గత వారం బస్తీలలో పర్యటించినప్పుడు తాగునీటి పైపులైన్‌ల లీకేజీల వల్ల తాగునీరు వృథా అవుతుందన్నారు. అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, జీఎం శ్రీనివాస్, డీజీఎం లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా తదితరులున్నారు.

రేపు ఎల్బీ స్టేడియంలో త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ అలేఖ్య పుంజాల

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళారంగాన్ని విశేషంగా ప్రోత్సహిస్తుందని తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య పుంజాల తెలిపారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఎల్బీ స్టేడియంలో త్యాగరాజస్వామి 258వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం రవీంద్రభారతిలోని తెలంగాణ సంగీత నాటక అకాడమి కార్యాలయంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..4న ఉదయం 10:30 గంటలకు త్యాగరాజ పంచరత్న కీర్తనలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. పద్మశ్రీ పురస్కార గ్రహీతలు శోభారాజు, ఎల్ల వెంకటేశ్వర్‌రావు, హైదరాబాద్ సిస్టర్స్ హరిప్రియ, లాంటి సీనియర్ కళాకారులు ఈ గానగోష్టిలో పాల్గొని యువ శాస్త్రీయ సంగీత కళాకారులకు స్ఫూర్తినిస్తారని వివరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 10 రోజుల పాటు కాళేశ్వరం పుష్కరాలలో 24 బృందాలతో సంగీత నృత్య కార్యక్రమాలను సైతం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ కార్యదర్శి బి.మనోహర్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళా కిరణాలు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ చిల్డ్రన్స్ థియేటర్ వర్క్‌షాప్ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. చిన్నపిల్లల్లో రంగస్థలంపై ఆసక్తి పెంచే విధంగా వర్క్‌షాప్ నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. 30 రోజుల పాటు జరిగేటటువంటి ఈ వర్క్‌షాప్‌ను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనదలచిన వారు 95500 92506లో సంప్రదించాలని నిర్వాహకులు కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ దర్శకుడు సింగపంగ ప్రభాకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

హుమయూన్ నగర్ పోలీస్‌స్టేషన్ పేరు మార్పుపై హర్షం

గోల్కొండ: మెహిదీపట్నంలోని హుమయూన్ నగర్ పోలీస్‌స్టేషన్ పేరు మార్చడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేషన్ పేరును పోలీసులు హుమయూన్ నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్‌గా పేరు మార్చారు. ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చే వారికి హుమయూన్ నగర్ అంటూ అసలు తెలియదు. ఒక కాలనీ పేరును పోలీస్‌స్టేషన్‌గా పెట్టడం అప్పట్లోనే చర్చనీయశంగా మారింది. మెహిదీపట్నం నడిబొడ్డులో ఉన్న పోలీస్ స్టేషన్‌ను హుమయూన్ నగర్ పోలీస్‌స్టేషన్‌గా పిలవడం సరికాదని గతంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకుంటున్న విద్యార్థినులు

గోల్కొండ: తాము చదువుకున్న కోర్సును పూర్తి చేసి పట్టాలు అందుకుంటున్న వారి ఆత్మవిశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉంటుందని ఇండియా హెడ్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకడియాల అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి విజయకడియాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థుల జీవితంలో గ్రాడ్యుయేషన్ డే ఎంతో కీలక ఘట్టం అని అన్నారు. జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.రాఘవరెడ్డి , వైస్ చైర్పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, సి.నర్మద, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, వి.నర్మద, కళాశాల పూర్వ విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ముసాఫిర్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాంక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ జెల్ది విద్యాధర్ రచించిన 'ముసాఫిర్' పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాంక్ మాట్లాడుతూ..కవులు ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలోని ఎన్నో విషయాలను కవిత్వాల రూపంలో రచయిత వివరించిన తీరు బాగుందని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని కోరారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బిక్కి కృష్ణ, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, కుసుమ ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు రాధాకుసుమ, కవయిత్రి శైలజ మిత్ర పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మామిడాల శ్రీనివాస్ తదితరులు

గౌలిపురా: రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం తలపెట్టడం దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. బేలా ముత్యాలమ్మ ఆలయ సమీపంలో సర్కిల్–2 షాపు నంబర్ 242 చౌకధరల పంపిణీ దుకాణంలో శుక్రవారం ఆయన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో పేద ప్రజలు ప్రతిరోజూ కడుపు నిండా తినాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పథకాన్ని తీసుకొచ్చారన్నారు.

గౌలిపురా డివిజన్‌లో..

యాకుత్‌పురా నియోజకవర్గం ఏ–బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం గౌలిపురా డివిజన్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ అల్లం భాస్కర్, టీపీసీసీ మీడియా సెక్రటరీ మామిడి గోపి, కార్యదర్శి మామిడి కృష్ణ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు రాకేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శశి యాదవ్, మహిళా నాయకురాలు నళినిగౌడ్, డల్లు శివ, శ్యామ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న వెంకటేశ్